# అమావాస్య అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్

ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (భారత శక్తి): సరూర్నగర్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ దేవస్థానంలో "అమావాస్య" సందర్భంగా రెండు వేల మంది భక్తులకు, పేద ప్రజలకు జరిగిన ప్రత్యేక అన్న వితరణ కార్యక్రమానికి సరూర్నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై స్వయంగా తన చేతుల మీదుగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి మొదటిసారిగా విచ్చేసిన తహసీల్దార్ వేణుగోపాల్ ని దేవాలయం ఫౌండర్ ట్రస్టులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్ లు పట్టు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నల్లంకి ధనరాజ్ గౌడ్. వీఎం హోమ్ వాకర్స్



అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నోముల కబీర్ దాస్ గౌడ్ గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం రాముని శ్రీనివాస్ గుప్తా, గోల్డెన్ టీం వాకర్స్ అధ్యక్షులు కాశెట్టి నాగేష్ గుప్తా సలహాదారులు ఉప్పల ఎన్టీఆర్ కృష్ణ, కూర శ్రీనివాస్ గుప్తా, సొల్లేటి ఆనంద్ గుప్తాలతోపాటు సరూర్నగర్ మరియు డాక్టర్స్ కాలనీ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# మహిళా బిల్లు చరిత్రాత్మకం

* **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్**

అమీన్‌పూర్ ఏప్రిల్ 17 (భారత శక్తి) : ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంట్ లో ప్రవేశపెట్టే మహిళా బిల్లు చారిత్రాత్మక బిల్లు అని దశబ్దాలా కాలంగా ఉన్న సమస్య పరిష్కారం అయ్యి మహిళలకు విజయం లభించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ పేర్కొన్నారు. బీజేపీ మహిళా మోర్చా నాయకులు సరస్వతి ఆధ్వర్యంలో మూడవసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా ఎన్నికైన అదెల్లి రవీందర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించిన స్వీట్ తినియంచారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ బీజేపీ లో కష్టపడి పనిచేసే వారిని పార్టీ గర్తించి తగిన విదంగా వారి సేవలు ఉపయోగించుకుంటుందని బీజేపీ లో మాత్రమే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ మహిళా బిల్లు33% ప్రవేశపెట్టి మహిళలకు రాజ్యాధికారం ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని దశబ్దాల కాలంగా ఎదురుచూస్తున్నా మహిళా బిల్లు మోడీ హయాంలో విజయవంతం అవుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మహిళమోర్చ నాయకురాళ్లు సరస్వతి రాంచద్రపురం పట్టణ ప్రధాన కార్యదర్శి పద్మ అనూష శాంతి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.




# ఫీజుల మోత.. పేరెంట్స్ ఆగ్రహం!

* **హెచ్.పీ.ఎస్ (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్) ముందు ధర్నా.. ఫీజులు ఫ్రీజ్ చేయాలని డిమాండ్.**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (భారత శక్తి) : నగరంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విపరీతంగా పెరుగుతున్న ఫీజులపై తల్లిదండ్రులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఫీజుల దోపిడీని అరికట్టాలంటూ శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. ముఖ్యంగా రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (HPS) ముందు భారీ సంఖ్యలో తల్లిదండ్రులు ధర్నాకు దిగారు.

**4 ఏళ్లలో 141 శాతం పెంపా?**

పాఠశాల యాజమాన్యం తీరుపై తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్ల కాలంలోనే ఫీజులను దాదాపు 141 శాతం పెంచేశారని వారు ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ భారం మోయలేనిదిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

* **తల్లిదండ్రుల ప్రధాన డిమాండ్లు ఇవే:**

ఫీజుల నియంత్రణ:* పెంచిన ఫీజులను వెంటనే తగ్గించి, రాబోయే ఐదేళ్ల వరకు ఫీజుల పెంపు లేకుండా 'ఫ్రీజ్' చేయాలి.

లిఖితపూర్వక హామీ: ఫీజుల నియంత్రణపై యాజమాన్యం నుంచి స్పష్టమైన రాతపూర్వక హామీ వచ్చే వరకు 'ఫస్ట్ టర్మ్' ఫీజులు చెల్లించేది లేదని స్పష్టం చేశారు.

పీటీఏ ఏర్పాటు: నిబంధనల ప్రకారం పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ (PTA) ఏర్పాటు చేసి, నిర్ణయాల్లో పారదర్శకత పాటించాలి.

* **తగ్గిన ప్రమాణాలు.. పెరిగిన భారం**

ఫీజులు భారీగా వసూలు చేస్తున్నప్పటికీ, పాఠశాలలో విద్యా ప్రమాణాలు మాత్రం దారుణంగా పడిపోతున్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు, పారదర్శకత కరువైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై నియంత్రణ తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో ఈ ఆందోళనలను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు.

## బి.హెచ్.ఇ.ఎల్

# డిపో నుండి వేసవి ప్రత్యేక బస్సులు

పటాన్‌చెరు ఏప్రిల్ 17 (భారత శక్తి ) : వేసవి సెలవులు మరియు పుణ్యక్షేత్రాల సందర్శన కోసం టి.జి.ఎస్.ఆర్.టి.సి బి.హెచ్.ఇ.ఎల్ డిపో మేనేజర్ వి. మోహన్ రావు గారు ప్రత్యేక బస్సులను ప్రకటించారు. ఏప్రిల్ మరియు మే నెలల్లో గోవా, హంపి, పండరీపూర్ ,అయోధ్య వంటి ప్రాంతాలకు రాజధాని మరియు స్లీపర్ బస్సులను ఏర్పాటు చేశారు. ఆసక్తి గల ప్రయాణికులు 9063501072 ,9391072283 నంబరును సంప్రదించి తమ సీట్లను రిజర్వ్ చేసుకోవాలని కోరారు.



# మహిళల భద్రత హక్కు.. సదుపాయం కాదు

* **15 రోజుల్లో 88 మంది ఆకతాయిల అరెస్టు: మల్కాజిగిరి డీసీపీ ఉషారాణి**

మల్కాజిగిరి: ఏప్రిల్ 17 (భారత శక్తి): మహిళలు, బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషారాణి హెచ్చరించారు. వేధింపులకు గురయ్యే వారు భయం వీడి ఫిర్యాదు చేయాలని సూచించారు. గడిచిన 15 రోజుల్లో షీ టీమ్స్ చేపట్టిన చర్యల వివరాలను ఆమె వెల్లడించారు.



**నిఘా నీడలో ఆకతాయిలు**

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో, విద్యాసంస్థలు, మార్కెట్ల వద్ద షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతున్నాయి. గత పక్షం రోజుల్లో మహిళలను వేధిస్తున్న 88 మందిని (73 మంది మేజర్లు, 15 మంది మైనర్లు) పట్టుకున్నారు.

* ఫిర్యాదులు: మొత్తం 106 ఫిర్యాదులు అందగా.. అందులో ప్రత్యక్ష వేధింపులు (53), ఫోన్ కాల్స్ (28), సోషల్ మీడియా వేధింపులు (25) ఉన్నాయి.
* చర్యలు:9 క్రిమినల్ కేసులు, 20 పెట్టీ కేసులు నమోదు చేయగా.. 66 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.
* మెట్రో తనిఖీలు: మహిళా కోచ్‌లలో ప్రయాణించిన ఐదుగురు పురుషులకు జరిమానా విధించారు.

**వెలుగులోకి వచ్చిన ప్రధాన కేసులు**

బ్లాక్ మెయిలింగ్: యువతి వ్యక్తిగత ఫోటోలు, వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తూ, ఆమె కుటుంబాన్ని దూషిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

* వేధింపులు: పెళ్లయిన విషయాన్ని దాచి, తోటి ఉద్యోగినిని ప్రేమ పేరుతో వేధిస్తూ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
* మోసం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకుని, ఆపై మోసం చేసిన వ్యక్తిని బాధితురాలి ఫిర్యాదుతో అరెస్టు చేశారు.

**అవగాహన.. కౌన్సెలింగ్**

మల్కాజిగిరి పరిధిలో 41 అవగాహన కార్యక్రమాల ద్వారా 3,097 మందికి చట్టాలపై అవగాహన కల్పించారు. పట్టుబడిన ఈవ్ టీజర్లకు ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

**సహాయం కోసం సంప్రదించండి:**

> వేధింపులు ఎదుర్కొనేవారు మల్కాజిగిరి వాట్సాప్ నంబరు 8712662111 కు లేదా ఎల్బీనగర్ (8712662602), ఉప్పల్ (8712665299), బేగంపేట (8712665300), వనస్థలిపురం (8712662604) నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న

# ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్‌చెరు ఏప్రిల్ 17 (భారత శక్తి) : తిరుమల శ్రీవారిని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రీవారి ఆశీస్సులతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆర్థిక అభ్యున్నతి సాధించాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు సీనియర్ నాయకులు విజయ్ కుమార్, అశోక్, చంద్రశేఖర్, ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడి కుమారుడు గూడెం సందీప్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

# అమెరికా ఒప్పందాలపై యువజన కాంగ్రెస్ యుద్ధం

* **18న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా: పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ**

అచ్చంపేట, ఏప్రిల్ 17 (భారత శక్తి): కేంద్ర ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 18న (శనివారం) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆవిష్కరించారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ శివంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒప్పందాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



**దేశ ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు**

ఈ సందర్భంగా శివంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలు దేశ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. భారత ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడం వల్ల దేశీయ పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా..

డేటా భద్రత: 140 కోట్ల భారతీయుల వ్యక్తిగత డేటా భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. పాడి రంగం విదేశీ కంపెనీల చేతుల్లోకి పాడి రంగం వెళ్లే ప్రమాదం పొంచి ఉంది.

**రైతులు, కార్మికులు:**

ఈ ఒప్పందం వల్ల అన్నదాతలు, కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతారు.

**కార్పొరేట్ కోసమే ఈ ఒప్పందాలు:**

ఈ ఒప్పందాలు పూర్తిగా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కుదుర్చుకున్నవని శివంత్ రెడ్డి ఆరోపించారు. అధికారిక పత్రాల్లో పేర్లు లేకపోయినా, ఈ ఒప్పందాల వెనుక కార్పొరేట్ సంస్థల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా మోదీని "ప్రాణమిత్రుడు" అని సంబోధించడం వెనుక ఉన్న మర్మం ఇదేనని అనుమానం వ్యక్తం చేశారు.

**తరలిరావాలని పిలుపు**

ఏప్రిల్ 18న జరిగే మహాధర్నాకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల కోసం సాగే ఈ పోరాటంలో యువత భాగస్వాములు కావాలని కోరారు.

# సంగారెడ్డి మున్సిపల్ కోఆప్షన్ అభ్యర్థుల ఎంపిక





* **కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన నిర్మల జగ్గారెడ్డి**

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 17 : సంగారెడ్డి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మల సంయుక్తంగా చేశారు. అభ్యర్థుల జాబితాలు ఈ సందర్భంగా జగ్గారెడ్డి ప్రకటించారు. రాంనగర్ మాజీ కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యుడిగా సత్తయ్య గారి శివశంకర్, మాజీ కౌన్సిలర్ రాములు సతీమణి కల్వకుంట యశోద, మైనార్టీ విభాగంలో మహమ్మద్ సలావుద్దీన్ లను ఎంపిక చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున కో ఆప్షన్ సభ్యులుగా పార్టీ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు.



# తొలి మహిళా సీఎం చేయడమే లక్ష్యం: రామకోటి

* కవితమ్మ నూతన పార్టీలోకి అల్లంపల్లి రామకోటి
* తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన బీసీ నేత
* ఈనెల 25న పార్టీ ఆవిర్భావ సభకు భారీగా తరలిరావాలని పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (భారత శక్తి): తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఆవిర్భవించనున్న నూతన రాజకీయ పార్టీలోకి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి చేరారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా పక్షపాతిగా, బీసీల గొంతుకగా నిలిచేందుకే కవితమ్మ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ఆయన కొనియాడారు.

**ఉద్యమాల గడ్డపై కొత్త నినాదం**

విద్యార్థుల చదువులు, నిరుద్యోగుల కొలువులు, కన్నీళ్లు లేని రైతు రాజ్యం కోసం నూతన పార్టీ పురుడుపోసుకుంటోందని రామకోటి పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన జరగనున్న పార్టీ ఆవిర్భావ సభకు తెలంగాణ ప్రజలు, బీసీలు, మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**మూడు దశాబ్దాల పోరాటాల గుర్తింపు**

గత 30 ఏళ్లుగా నీతి, నిజాయితీతో అల్లంపల్లి రామకోటి చేసిన పోరాటాలను గుర్తించి కవితమ్మ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆయన అనేక ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

* చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి.
* పార్లమెంట్‌లో వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి.
* కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.
* స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలి.
* వంటి ప్రధాన డిమాండ్లతో అసెంబ్లీ, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాల్లో రామకోటి చురుగ్గా పాల్గొన్నారు.

లక్ష్యం: తెలంగాణ తొలి మహిళా ముఖ్యమంత్రి దశాబ్దాలుగా బీసీ హక్కుల కోసం పోరాడుతున్న తనను గుర్తించి గౌరవించిన కల్వకుంట్ల కవితకు రామకోటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా కవితమ్మను పీఠంపై కూర్చోబెట్టడమే తన తక్షణ కర్తవ్యమని, దీనికోసం క్షేత్రస్థాయిలో శ్రమిస్తానని ఆయన శపథం చేశారు. బీసీల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కేవలం ఈ నూతన పార్టీతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.



## తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన టీజీఈ జేఏసీ నాయకులు

ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ, శుక్రవారం టీజీఈ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు శుక్రవారం సరూర్నగర్ మండల తహసిల్దార్ పి. వేణుగోపాల్ కు వారి ప్రధాన డిమాండ్లతో జూన్ 2 వ తేది నాటికి పీఆర్సీ అమలు పరచాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలనీ, ప్రకటిత ఎంప్లాయిస్ హెల్త్ స్కీం తక్షణమే అమలులోకి తెస్తూ అందరికీ హెల్త్ కార్డ్స్ జారీ చేయాలనీ, సీపీఎస్ రద్దు చేసి ఒపీఎస్ విధానం పునరుద్ధరణ చేయాలనీ, 61 సంవత్సరాలు నిండిన విఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సాధారణ బదిలీలు చేపట్టాలని వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో జీ. డేవిడ్, గోవర్ధన్ యాదవ్, ఆర్ఐ జ్యోతి జీవన్ జ్యోతి, వి. ఈశ్వర్, బి. ప్రభాకర్, ఎస్. ప్రవీణ్,టీ. ప్రవర్ధన్ రెడ్డి రషీద్, అఖిల, వైఎస్ కల్పన, సరళ, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## యూడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 17 (భారత శక్తి): ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం నాడు వారి క్యాంపు కార్యాలయంలో జరిగిన యూడిఐడి కార్డుల పంపిణి కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా పలువురు దివ్యాంగులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, అంగవైకల్యంతో బాధ పడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యుడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శివప్రకాష్,గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల అధ్యక్షులు మందా బిక్షపతి యాదవ్,ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు వర్కాల భాగ్యలక్ష్మి,సిద్ధం నర్సింగ్, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన



జగిత్యాల, ఏప్రిల్ 17 ( భారత శక్తి ప్రతినిధి ): ధర్మపురి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ధర్మపురి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున నాయబ్ తహసీల్దార్ గారికి ఉద్యోగుల సమస్యల సాధన కొరకువినతి పత్రం సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టి జి ఈ జె ఏ సి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మొదటి దశలో మండల కేంద్రంలో నిరసన లో భాగం నేడు తెలంగాణ 2వ PRC ని శివశంకర్ కమిటీ నుండి తెప్పించుకొని 51% ఫిట్మెంట్తో వెంటనే అమలు కొరకు మరియు ఉద్యోగుల ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ మరియు 13వేల పైచిలుకు ఉన్న ఉద్యోగుల మరియు పెన్షనర్ల పెండింగ్ బిల్లులను ఏకమొత్తంలో ఒకేసారి విడుదల చేయాలని అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (CPS) ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (OPS) ను అమలు చేయడం తో పాటు ప్రభుత్వం ముందుంచిన 63 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు . ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం రాకపోతే, మే 5న అన్ని జిల్లా కేంద్రాలు, ల్ వద్ద నిరసనలు, మరియు మే 14న భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పత్తి రవీందర్, TRTF రాష్ట్ర బాధ్యులు గజభీంకార్ గోవర్ధన్,దాసరి భీమయ్య,మండల అధ్యక్షులు బండారి సతీష్, ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్,మండల కార్యవర్గ సభ్యులు కాసర్ల వెంకటరమణ, సాధు శ్రీకాంత్,పురంశెట్టి సత్యనారాయణ,ఈశ్వరుడు,మెదం తిరుపతి,PR TU నాయకులు భోగ శివ ప్రసాద్,కిరణ్ కుమార్, చంద్ర హరి,TSCPSEU రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ కుమార్,మహేష్,రాజేష్, పెన్షనర్లు ఇందారపు బండయ్య,సంగి రాజన్న,శంకర్ శర్మ, దత్తాత్రి, AEOలు భువనేశ్వర్,అయ్యోరి వినోద్, అజయ్, పంచాయతీ కార్యదర్శులు కట్కం లక్ష్మన్, నరేష్, ఎంపీడీఓ ఆఫీస్ సిబ్బంది సూపరిండెంట్ రాణి మేడం,రవీందర్, మహేష్, ఎం ఆర్ ఓ ఆఫీస్ సిబ్బంది వి.భాస్కర్ రెడ్డి, కే. అనిల్,శ్రీనివాస్ మరియు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అవసరం

- కాకతీయ హైస్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు
- బి-స్మార్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి



సిద్దిపేట, ఏప్రిల్ 17 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిస్మార్ట్ (బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రైమరీ విద్యార్థులకు ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేయడం ద్వారా వారికి ప్రోత్సాహం కలిగించడంతో పాటు గుర్తింపును ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని, పురాణ ఇతిహాసాలను పరిచయం చేస్తూ మహనీయుల అడుగుజాడల్లో నడిపించాల్సిందిగా ఉపాధ్యాయులకు సూచించారు. చదివిన పాఠశాలకు, విద్య నేర్పిన గురువులకు కీర్తి తీసుకురావాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత,ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ గ్రామంలో ఘనంగా పోషణ పక్షం పై అవగాహన

- అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్



దుబ్బాక, ఏప్రిల్ 17 (భారత శక్తి) : గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకొని పోషకాహారం తీసుకోవాలని తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ సూచించారు.9 ఏప్రిల్ నుండి 23 వరకు నిర్వహిస్తున్న పోషణ పక్షం కార్యక్రమాల షెడ్యూల్‌లో భాగంగా, దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలోని రెండవ అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ స్థాయి పోషణ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్ మాట్లాడుతూ, ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. గర్భధారణ నుండి బిడ్డ రెండేళ్ల వయస్సు వరకు ఉన్న 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే "ఆరోగ్య లక్ష్మి" పథకం కింద అదనపు సంపూర్ణ భోజనాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ అంగన్వాడీ సేవలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామస్థాయిలో అవగాహన పెంచుతాయని తెలిపారు. అలాగే "బేటి బచావో బేటి పడావో" కార్యక్రమంలో భాగంగా గర్ల్ చైల్డ్ కిట్ల పంపిణీ ప్రారంభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వాసవి మాట్లాడుతూ ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించి బాలింతలకు గర్ల్ చైల్డ్ బేబీ కిట్లను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ గర్భిణీలు, బాలింతలు పాటించాల్సిన ఆరోగ్య సూచనలు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించగా, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమం ముగింపులో గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ విజయ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు పాలకవర్గ సభ్యులందరినీ అంగన్వాడీ సిబ్బంది శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ వాసవి, మండల్ కోఆర్డినేటర్ పద్మ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైసర్ స్వరూప, మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ, గ్రామ ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోసానిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 17: రామారెడ్డి మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు విధానాన్ని సమీక్షించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రతి వరి సంచికి 40.600 కిలోల తూకం ఉండేలా ఖచ్చితంగా కొలవాలని ఆయన ఆదేశించారు. తూకం ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనంతరం సన్నధాన్యం నాణ్యతను మిషన్ ద్వారా పరీక్షించి, తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే కేంద్రంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, నిల్వ సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డిఎమ్ శ్రీకాంత్, డిసీఓ రామ్మోహన్, ఎమ్మార్వో సుమలత, పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందజేసిన సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

జనగామ జిల్లా(భారత శక్తి)ఏప్రిల్ 17 : జనగామ జిల్లా,దేవరుప్పుల మండలకేంద్రంలో మూడు రోజులుగా శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఉత్సవాలు జరుగుతుండగా నిన్న సాయంత్రం స్వామి వారి కళ్యాణమహోత్సవం జరుగగా, ఈ రోజు సాయంత్రం శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు వందలాదిగా వస్తున్న భక్తులకు 150 కిలోల పులిహోర (పులిహోర దాత)ప్రసాదాన్ని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అందజేశారు



